చినుకు పడితే జలమయమే..

- చిన్నపాటి వర్షానికే నీటితో నిండిపోతున్న ఎమ్మార్సీ ఆవరణ
- అదే సముదాయంలో పాఠశాల, భవిత కేంద్రం, అంగన్‌వాడీల నిర్వహణ
- పరిష్కారానికి నోచని మౌలిక సమస్యలు
- ఇబ్బందుల్లో విద్యార్థులు, సిబ్బంది


చెరువును తలపిస్తున్న ఎమ్మార్సీ ఆవరణ


గేటు ఎదుట ఉన్న మోడువారిన వృక్షం

అర్వపల్లి : నకిరేకల్–తానంచెర్ల జాతీయ రహదారి వెంట అర్వపల్లిలో ఉన్న ఎమ్మార్సీ కార్యాలయం సమస్యలమయంగా మారింది. ఈ ఎమ్మార్సీ ఆవరణలో ప్రాథమిక పాఠశాల, రెండు అంగన్‌వాడీ కేంద్రాలు, భవిత కేంద్రం ఉన్నాయి. అయితే ఇన్ని విద్యాలయాలు ఒకే సముదాయంలో ఉన్నా అనేక సమస్యలు తాండవిస్తున్నాయి. ఈ ఆవరణ వంపులో ఉండటం, హైవేరోడ్డు ఎత్తుకావడంతో చిన్నపాటి వర్షం వచ్చినా జలమయమవుతుంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఈ ఆవరణ నీటితో నిండిపోయి పిల్లలు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ఆవరణలో చేరిన వర్షపు నీరు బయటకు వెళ్లడానికి అవకాశం లేక నిలిచి ఉంటుంది.

ఎన్నో సమస్యలు..

ఈ సముదాయం ఎదుట ప్రధాన గేటు ముందు మోడువారిన వృక్షం ప్రమాదకరంగా ఉంది. ఈ వృక్షం కొమ్మ ఇటీవల కూలిపోగా ఆ సమయంలో పిల్లలు ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ వృక్షాన్ని వెంటనే కూల్చివేయాల్సి ఉంది. దీనికి తోడు ఈ సముదాయంలో మన ఊరు–మన బడి పనులు జరుగుతుండటంతో ఈ పనుల కోసం తెచ్చిన కంకర, ఇసుక ఇతర మెటీరియల్‌తో ఆవరణ నిండిపోయింది. పైగా ఆవరణలో పిచ్చి మొక్కలు కూడా పెరిగాయి. ఎమ్మార్సీకి సంబంధించి టాయిలెట్ల నిర్మాణం కూడా చేపట్టాలి. ప్రధానంగా ఈ సముదాయం ఎదుట ఎమ్మార్సీ ఆవరణలో ఉన్న అన్ని విద్యాలయాలను సూచించే నేమ్‌బోర్డులు కూడా ఏర్పాటు చేయాల్సి ఉంది.

మోడువారిన వృక్షం తొలగిస్తాం



ఈ సముదాయంలోని గేట్ ఎదుట ప్రమాదకరంగా ఉన్న మోడువారిన వృక్షాన్ని తొలగించడానికి ఎస్‌ఎంసీ తీర్మానం చేశాం. రెండుమూడు రోజుల్లో ఈ వృక్షాన్ని తొలగిస్తాం. అలాగే మన ఊరు– మనబడి పనులు జరుగుతున్నందున ఆవరణ అపరిశుభ్రంగా ఉంది. ఈ పనులు కాగానే పూర్తిగా శుభ్రం చేయిస్తాం. **- కట్టెల మల్లయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్**

సమస్యలు పరిష్కరిస్తాం



ఎమ్మార్సీ ఆవరణ ఎదుట వంపుగా ఉండటంతో వర్షపు నీళ్లు నిలుస్తున్నాయి. ఈ నీళ్లు బయటికి వెళ్లిపోయేలా చర్యలు తీసుకుంటాం. అలాగే మోడువారిన వృక్షం తొలగించడం, అపరిశుభ్రంగా ఉన్న ఆవరణను శుభ్రం చేయించే పనులు చేపడుతాం. నేమ్‌బోర్డులను కూడా ఏర్పాటు చేయిస్తాం. **- బాలునాయక్, ఎంఈఓ**

బాలభవన్‌కు సౌండ్ సిస్టం బహూకరణ


సౌండ్ సిస్టంను అందజేస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని బాలభవన్‌కు మ్యూజిక్ సౌండ్ సిస్టం, స్పోర్ట్స్ కిట్‌ను శనివారం జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి బాలభవన్ సిబ్బందికి బహూకరించారు. బాలభవన్‌కు మ్యూజిక్ సౌండ్ సిస్టమ్ లేదని బాలభవన్ అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షురాలు గుంటకండ్ల సునీత మంత్రి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన మంత్రి సొంత నిధులతో యాభై వేల విలువైన మ్యూజిక్ సౌండ్ సిస్టం తోపాటు స్టూడెంట్స్ కోసం స్పోర్ట్స్ కిట్‌ను అందించారు. ఈ సందర్భంగా మంత్రి జగదీష్‌రెడ్డికి, సునీతలకు బాలభవన్ సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బాలభవన్ సిబ్బంది దాసరి ఎల్లయ్య, ఉమా, సత్యనారాయణసింగ్, అనిల్, వీరయ్య, హమీద్ ఖాన్, సంధ్య, దివ్య, రేఖ తదితరులు పాల్గొన్నారు.

తండాకు వెళ్లే రోడ్డుపై నాట్లు వేసి నిరసన


మర్రికుంట తండాలో రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

తిరుమలగిరి : తిరుమలగిరి మండలం మర్రికుంట తండాకు వెళ్లే దారి పూర్తిగా గుంతలమయంగా మారి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్సోజు నరేష్ అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తండాకు వెళ్లే రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గుంతలమయంగా మారిన రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజా ప్రతినిధులకు, అధికారులకు తెలియజేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మర్రికుంట తండాకు సీసీ రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాలకుర్తి రాజయ్య, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కందుకూరి అంబేద్కర్, ఎంపీటీసీ సభ్యులు జమ్మిలాల్, ప్రేమ్‌ప్రసాద్, మల్లయ్య, రాజు, భాస్కర్, శ్రీను, రాజేందర్, వంశీ, రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రీడలతో దేహ దారుఢ్యం


పెన్‌పహాడ్‌లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీటీసీ జానకమ్మ

పెన్‌పహాడ్ : క్రీడలతో దేహ దారుఢ్యం పెంపొందుతుందని ఎంపీటీసీ ఊరుకొండ జానకమ్మ అన్నారు. ఇటీవల నిర్వహించిన జీజేఆర్ కప్ క్రీడా పోటీల్లో విజేతలకు శనివారం మండల కేంద్రంలో బహుమతులు అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్‌మెంబర్ రఫీ, రాధాకృష్ణ, గుడిపూరి రవి, ఒగ్గు గోపి, ఉపేందర్, రమణ, రెహమాన్, వినోద్, ఒగ్గు వీరయ్య, హన్మంతు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

సూర్యాపేటటౌన్ : వర్షాల కారణంగా ప్రభుత్వం మూడు రోజులు సెలవులిచ్చినా జిల్లా కేంద్రంలో కొన్ని పాఠశాలలు నడిపిస్తున్నారని, ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలలను సందర్శించి మాట్లాడారు. జిల్లా కేంద్రంలో ప్రైవేట్ విద్యా సంస్థలు వ్యాపారకులుగా మారి విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తున్నాయన్నారు. ఈ విద్యా సంస్థలపై ప్రభుత్వ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు విష్ణు, రమేష్, నగేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పలు పాఠశాలలను తనిఖీ చేసిన డీఈఓ..

జిల్లా కేంద్రంలో శనివారం ప్రభుత్వం సెలవు ఇచ్చినప్పటికీ పలు పాఠశాలలను నడిపించారు. అయితే కొంతమంది ఫిర్యాదు చేయడంతో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ పలు పాఠశాలలను తనిఖీ చేశారు. సెలవు రోజు పాఠశాలను నడిపిస్తున్నట్లు ప్రత్యక్షంగా చూడటంతో ఏవీఎం పాఠశాల ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేసినట్లు డీఈఓ తెలిపారు. సెలవు రోజుల్లో ఎవరైనా ప్రైవేట్ పాఠశాలలు నడిపించినట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా రాజు


రాజు

తుంగతుర్తి : యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా స్టేట్ కో ఆర్డినేటర్‌గా తుంగతుర్తి మండల కేంద్రానికి చెందిన కొండ రాజు శనివారం నియమితులయ్యారు. ఈ మేరకు యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా జాతీయ కన్వీనర్ మంజు జైన్ ఉత్తర్వులు జారీ చేశారు.

అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామ యూత్ కాంగ్రెస్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బింగి హరీష్, ఉపాధ్యక్షుడిగా మద్ది ఉజ్జితేలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు వేములకొండ ఉప్పలయ్య, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి, నాయకులు రత్నం లక్ష్మాజీ, కోటిరెడ్డి, లింగరాజు, వెంకన్న, బాలరాజు, సంతోష్, శంకర్, మహేష్ పాల్గొన్నారు.

చర్చి వార్షికోత్సవం


కేక్ కట్ చేస్తున్న పాస్టర్లు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని సీఎస్ఐ చర్చి 10వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో రెవరెండ్ రత్నాకర్, పాస్టర్ వినిల్‌జాయ్, రెంటాల కరుణకుమార్, సంద పృథ్వీ, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

7న కల్లుగీత సొసైటీ ఎన్నిక

భానుపురి : ఆగస్టు 7వ తేదీన సూర్యాపేట పట్టణ కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం ఎన్నిక నిర్వహిస్తున్నట్లు కల్లుగీత పారిశ్రామిక సహకార ఎన్నిక సంఘం అధికారి జి.నాగేశ్వర రావు తెలిపారు. శనివారం స్థానిక కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం కార్యాలయంలో ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ నెల 27, 28, 31 తేదీల్లో నామినేషన్ల ప్రక్రియ ఉంటుందని, ఆగస్టు ఒకటో తారీఖున స్క్రూటినీ, ఆగస్టు 2న ఉపసంహరణ, అదే రోజు గుర్తుల కేటాయింపు జరుగుతుందని వెల్లడించారు. డైరెక్టర్ల స్థానాల కంటే ఎక్కువ నామినేషన్లు దాఖలు చేస్తే ఆగస్టు 7వ తారీఖున ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ నిర్వహించి భోజన విరామం తర్వాత అదే రోజు లెక్కింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున సూర్యాపేట పట్టణ కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘ సభ్యులు గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో గునగంటి కృష్ణ, కక్కిరేణి సత్యనారాయణ, బండారు లక్ష్మయ్య, కక్కిరేణి చిన్న సైదులు, గుండగాని శీను, రాపర్తి లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వినతి


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి : రాష్ట్రంలో వివిధ రంగాల్లో మూడు లక్షలకుపైగా హమాలీ కార్మికులు కొనసాగుతున్నారని, వారికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని హమాలీ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కునుకుంట్ల సైదులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ప్రగతిశీల హమాలీ – మిల్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం కలెక్టరేట్‌లోని లేబర్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యులు సామ నర్సిరెడ్డి, ఇరుగు సురేష్, హమాలీ ఫెడరేషన్ జిల్లా కమిటీ సభ్యులు ఒగ్గు వెంకన్న, పులుసు లక్ష్మయ్య, నిమ్మల హరిప్రసాద్, వేదాసు మల్లేష్, మరిపడిగా పురుషోత్తం, జాల గురుమల్లు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమానికి ప్రేరణ దాశరథి


సూర్యాపేటలో దాశరథి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నిమ్మల శ్రీనివాస్‌గౌడ్


తుంగతుర్తిలో దాశరథి కృష్ణమాచార్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

భానుపురి : తన కవితలు, రచనలతో తెలంగాణ ఉద్యమానికి దాశరథి కృష్ణమాచార్య ప్రేరణ కల్పించారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శనివారం దాశరథి కృష్ణమాచార్య జయంతి సందర్భంగా పట్టణంలోని కేంద్ర గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ నిజాం నవాబును ఎదిరించి తెలంగాణ కోసం పోరాటం చేసిన ధీశాలి దాశరథి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.వి సీతారామశాస్త్రి, లైబ్రేరియన్లు శ్యాంసుందర్, రంగారావు, విజయభాస్కర్, సృజన, పాఠకులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : మండల కేంద్రంలోని గ్రంథాలయ ఆవరణలో మహాకవి దాశరథి కృష్ణమాచార్యుల 99వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దాశరథి కృష్ణమాచార్యుల చిత్రపటానికి గ్రంథాలయ చైర్మన్ గోపగాని రమేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, నాయకులు గుండగాని రాములు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సంతోష్, వెంకన్న, పరమేష్, రవికుమార్, సూరయ్య, నాగమల్లు, ఎల్లయ్య, వెంకన్న, సుధాకర్, శివ, మహేష్ గ్రంథాలయ సిబ్బంది సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల స్వీపర్ల దీక్షకు మద్దతు


మద్దతు తెలుపుతున్న టీజేఎస్ నాయకులు

సూర్యాపేటటౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లు దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధర్మార్జున్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక డీఈఓ కార్యాలయం ఎదుట పాఠశాలల స్వీపర్లు చేస్తున్న దీక్షలో పాల్గొని వారికి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు మాంద్ర మల్లయ్య యాదవ్, యువజన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారబోయిన కిరణ్ కుమార్, కంబాలపల్లి శ్రీనివాస్, బంధన్ నాయక్, సతీష్, ఖలీల్, మన్సూర్ నాయక్, కృష్ణా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాకారుల ప్రదర్శన


చాకలిగూడెంలో ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

అర్వపల్లి : ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల జిల్లా టీం లీడర్ మేడిపల్లి వేణు కోరారు. శనివారం చాకలిగూడెంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, హరితహారం, సీజనల్ వ్యాధులపై తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో ఆటపాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఎండీ. హమీద్, కళాకారులు వెన్నెల నాగరాజు, గడ్డం ఉదయ్, పాలకుర్తి శ్రీకాంత్, పాక ఉపేందర్, పల్లెల రాము, లక్ష్మణ్, మంజుల, నాగలక్ష్మి, శిరీష, ప్రియాంక పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

తుంగతుర్తి : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలంగాణ సంస్కృతిక సారథి జిల్లా కోఆర్డినేటర్ వేముల నరేష్ అన్నారు. శనివారం మండల పరిధిలోని దేవునిగుట్టతండాలో పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్కృతిక సారథి సభ్యులు గంట భిక్షపతి, మాగి శంకర్, వేముల శ్రవణ్, ఈర్ల సాయి, పల్స నిర్మల, సిరిపంగి రాధ, నెమ్మాది స్రవంతి, ఇందిర, ప్రియదర్శిని, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీనది


జాజిరెడ్డిగూడెం శివారులో నిండుగా ప్రవహిస్తున్న మూసీనది

అర్వపల్లి : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద మూలంగా జాజిరెడ్డిగూడెం శివారులోని మూసీనది ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈ నది గుండా మూసీ ప్రాజెక్టుకు వరద భారీగా వెళ్తుంది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

17వ రోజూ కొనసాగిన జీపీ కార్మికుల సమ్మె


తిరుమలగిరిలో భిక్షాటన చేస్తున్న జీపీ కార్మికులు


ఆత్మకూరులో సమ్మెకు మద్దతు తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


అర్వపల్లి : మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న గ్రామ పంచాయతీ కార్మికులు

తిరుమలగిరి : తమ సమస్యలు పరిష్కరించాలని చేస్తున్న సమ్మెలో భాగంగా శనివారం గ్రామ పంచాయతీ కార్మికులు తిరుమలగిరిలో భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. 17 రోజులుగా గ్రామ పంచాయతీ కార్మికులు శాంతియుతంగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలు పరిష్కరించి న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో బక్కయ్య, రాజు, శోభ, నాగయ్య, వెంకన్న, అనిల్, ప్రభ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు ఎమ్మార్పీఎస్ నాయకుల మద్దతు

ఆత్మకూరు (ఎస్) : తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు శనివారం ఎమ్మార్పీఎస్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ మేడి కృష్ణ మాదిగ మాట్లాడారు. పారిశుద్ధ్య కార్మికులు చాలీచాలని వేతనాలతో చేసిన కష్టంతోనే రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీలకు ఉత్తమ అవార్డులు వచ్చాయన్నారు. ఆకలి కేకలు కార్మికులకు.. అవార్డులు ప్రభుత్వానికా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ ములకలపల్లి రవి మాదిగ, ఎంఎస్‌ఎఫ్ జిల్లా ఇన్‌చార్జ్ బత్తుల వెంకట రాములు, జగన్, పల్లెల రాములు, మాతంగి నాగయ్య, బొడ్డు పీటర్ తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై కూర్చొని నిరసన

అర్వపల్లి : తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ చేస్తున్న సమ్మెలో భాగంగా శనివారం గ్రామ పంచాయతీ కార్మికులు అర్వపల్లిలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికుల సంఘం మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు జీడి కృష్ణ, కన్నెబోయిన శ్రీశైలం, గుగులోతు నాగులునాయక్, చెరుకు శంకర్, యాకూబ్, ప్రవీణ్, బాషమియా, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధనగ్నంగా ఒంటికాలుపై నిలబడి నిరసన

చివ్వెంల : పంచాయతీ కార్మికులను పర్మనెంట్ చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేస్తున్న పంచాయతీ కార్మికుల సమ్మె శనివారం కొనసాగింది. ఈ సమ్మెలో సాగర్, రాంబాబు, ఈదయ్య, కృష్ణ, గోపాల్, భిక్షం, మురళి, శంకర్, రవి, వాణి, నాగరాజు, ఐలయ్య, మంగ, పూలమ్మ, ప్రసాద్, ఉప్పలయ్య, నాగులు, మోహన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : గ్రామ పంచాయతీ పరిధిలో పని చేస్తున్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని గ్రామ పంచాయతీ వర్కర్ల సంఘం మండల అధ్యక్షుడు రణపంగ వెంకన్న కోరారు. శనివారం తమ సమస్యల పరిష్కారం కోసం మండల పరిషత్ కార్యాలయం ఎదుట 17 రోజులుగా నిర్వహిస్తున్న సమ్మెలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి నకిరేకంటి నర్సయ్య, రమణయ్య, ఎల్లమ్మ, మట్టయ్య, దూదియా, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు రూ. 20వేలకు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని కారోబార్‌ల సంఘం జిల్లా నాయకుడు నకిరేకంటి శంభయ్య అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ వర్కర్లు నిర్వహిస్తున్న 17వ రోజు సమ్మెలో దండాలు పెడుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.


చివ్వెంల : అర్ధనగ్నంగా ఒంటికాలుపై నిలబడి నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు



నూతనకల్ : దండాలు పెట్టి నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు



పెన్‌పహాడ్ : సమ్మెలో పాల్గొన్న జీపీ కార్మికులు

రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలి

భానుపురి : పెరిక కుల ఆత్మగౌరవ, రాజకీయ ప్రాధాన్యత అంశంపై సూర్యాపేట జిల్లా కేంద్రంలోని త్రివేణి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు సూర్యాపేట పట్టణ మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టు కొండ సత్యనారాయణ, హైదరాబాద్ పెరిక హాస్టల్ అధ్యక్షుడు అంగిరేకుల నాగార్జున శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పెరిక కులస్తుల అభివృద్ధి, ఆత్మగౌరవం, రాజకీయ భవిష్యత్ కార్యాచరణ, బీసీ కుల ఉద్యమాల్లో పెరికల పాత్ర, పెరిక కుల కార్పొరేషన్ ఏర్పాటుతో తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి పార్టీలకు అతీతంగా సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్మన్లు, సింగిల్ విండో డైరెక్టర్లు, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు, జిల్లా సభ్యులు, వివిధ పదవుల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రతి నాయకుడు, మాజీ ప్రజాప్రతినిధులు వివిధ రకాల హోదాల్లో ఉన్న నేతలు ప్రతి ఒక్కరూ హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

వైభవంగా గోదాదేవి తిరునక్షత్ర వేడుకలు


భానుపురి : సూర్యాపేటలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వేడుకల్లో పాల్గొన్న భక్తులు


తుంగతుర్తిలోని రామాలయంలో పూజలు..

భానుపురి : పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గోదాదేవి తిరునక్షత్ర వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారికి నవ కలశ తిరుమంజనస్నపనం చేపట్టారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, తదియారాధన అన్నప్రసాదాలు అందజేశారు. సాయంత్రం పట్టుచీరలతో అమ్మవారిని అలంకరించి పూల పల్లకిలో ఆలయ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలచార్యులు, అర్చకులు శ్రీహరి ఆచార్యులు, సంకర్షణాచార్యులు, హరిచరణ్ ఆచార్యులు, ఫణికుమార్ ఆచార్యులు, ఆలయ కార్య నిర్వహణ అధికారి వై.శ్రీనివాసరెడ్డి, ఆండాళ్ గోష్ఠి, వికాస తరంగిణి భక్తబృందం తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : మండల మండల కేంద్రంలోని శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం శ్రీ గోదాదేవి అమ్మవారి తిరునక్షత్ర పుట్టినరోజు మహోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గోదాదేవికి అభిషేకం, నిత్య కార్యక్రమాలు, నివేదనలు, నీరాజన మంత్ర పుష్పం, తీర్థగోష్ఠి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు కాటూరి రామాచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శనివారం గోదాదేవి తిరునక్షత్ర వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష పూజలు, సహస్రనామార్చనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మకు పూజలు

చిలుకూరు : పాత చిలుకూరులోని బొడ్రాయి, ముత్యాలమ్మ ఆలయంలో నూతన విగ్రహాలు ప్రతిష్ఠించి 41 రోజులు అయిన సందర్భంగా శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా విగ్రహ ప్రతిష్ఠాపనకు సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ బండ్ల ప్రశాంతికోటయ్య, జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీషానాగేంద్రబాబు, సర్పంచ్ కొడారు బాబు, ఎంపీటీసీలు బెల్లంకొండ రమణనాగయ్య, వద్దేపల్లి కల్యాణి కోటేష్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గరిణె శేషగిరిరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నూతనకల్ : మండల కేంద్రంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ప్రణయ్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు ట్రాన్స్‌కో సిబ్బందికి సహకరించాలని కోరారు.

రాజీనామా చేయాలి

ఆత్మకూరు (ఎస్) : మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనలకు, మహిళలను నగ్నంగా ఊరేగించి లైంగిక దాడి ఘటనకు బాధ్యత వహిస్తూ మణిపూర్ సీఎం వెంటనే రాజీనామా చేయాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య శనివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. మణిపూర్ రాష్ట్రంలో రెండున్నర నెలలుగా అనేక ఆకృత్యాలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమని తెలిపారు. రాష్ట్రంలో వెంటనే శాంతి నెలకొనేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు కోరారు.

అర్వపల్లి : మణిపూర్‌లో జరుగుతున్న హింసను ఆపి శాంతిని నెలకొల్పాలని సీపీఐ(ఎంఎల్) రామచంద్రన్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బుద్దా సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ అసమర్థత వల్లే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నాగారం : ఫణిగిరికి చెందిన కొమిరె అల్లయ్య ఇటీవల జరిగిన దాడిలో గాయపడి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సందర్భంగా ఆయనను గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త చాగంటి అంబేద్కర్ శనివారం ఆస్పత్రిలో పరామర్శించారు. బాధితుడి భార్య రేణుకకు రూ.20,000 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పంది సుధాకర్, ప్రభాకర్, నాగరాజు, ఎర్ర యాకోబు తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న చాగంటి అంబేద్కర్